


శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 41.5°C | కనిష్ఠం : 24.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా: 6.35 గం.
సహర్ : సోమవారం ఉ: 4.42 గం.



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు రాశులు (ఫైల్)

రాబడి రాక.. సాగు చేయలేక..

- జిల్లాలో భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- 20 పల్లిపప్పు, 6 పసుపు డోలా, 7 నూనె మిల్లులూ బంద్
- అనుబంధ పరిశ్రమలు కూడా మూత
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

కేసముద్రం, ఏప్రిల్ 6 : పసుపు పంట సాగుకు మానుకోట ప్రాంతానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలోనే కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పసుపు రాబడుల్లో రెండో స్థానంలో ఉండేది. ఒకప్పుడు జిల్లాలో వాణిజ్య పంటలైన వేరుశనగ, పసుపు దిగుబడుల్లో రికార్డులు సాధించాయి. అలాంటిది ధరల పతనం, పొరుగు రాష్ట్రాల్లో అధికంగా సాగు, ఇతరాత్ర అంశాల ప్రభావంతో ఏడేళ్లుగా పసుపు, వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. జిల్లాలో ప్రముఖంగా ఉన్న మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్లలో వేరుశనగ, పసుపు పంటల రాబడులు ఏటా తగ్గుతూ వస్తుండటంతో రైతులు సాగుకు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఫలితంగా ఆయా మార్కెట్ల పరిధిలో వేరుశనగ, పసుపు పంట ఉత్పత్తులకు అనుగుణంగా నెలకొల్పిన పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. మరికొన్ని మూసివేసే దశలో ఉండడం ఆందోళన కలిగించే విషయం. పరిశ్రమలు మూతపడడం వల్ల వాటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వందలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. పంట ఉనికి కోల్పేయే పరిస్థితులు ఉండడంతో రైతుల నుంచి పరిశ్రమలు నెల కొల్పిన వ్యాపారులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల వరకు గొలుసుకట్టులో ఉన్న వారంతా నష్టపోనున్నారు.

ఒకప్పుడు వెలుగులు..

మహబూబాబాద్ జిల్లా పేరు చెప్పగానే వాణిజ్య పంట ఉత్పత్తుల్లో పసుపు గుర్తొస్తుంది. ఇక్కడి పసుపు సాగును ప్రత్యేకంగా మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించడం గమనార్హం. దశాబ్దాల క్రితం కేసముద్రం మార్కెట్‌లో పసుపు, వేరుశనగ పంట ఉత్పత్తులు యార్డు స్థలం సరిపోక రోడ్ల వెంట రాశులుగా పోసి రోజుల తరబడి పడిగాపులు పడుతూ విక్రయించారు. జిల్లాలోని పసుపును, పసుపు డోలా మిల్లుల్లో ఉత్పత్తి అయిన పొడిని ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక నూనె మిల్లుల్లో నూనెను హోల్‌సేల్‌గా కంటే రిటైల్‌గా మిల్లులు ఉన్న ప్రాంతాల్లోని ప్రజలే కాకుండా దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఖరీదు చేసుకొని క్యాన్లలో తీసుకువెళ్లేవారు. ఆయా మిల్లుల్లో ఉత్పత్తి అయిన పల్లిపప్పును గ్రేడింగ్ చేసి దేశ విదేశాలకు ఎగుమతి చేసే వారు. పసుపు, పల్లి మిల్లుల్లో 400మందికి పైగా కార్మికులు, హమాలీలు పనిచేస్తుండగా, మరో 500మంది వరకు పరోక్షంగా ఈమిల్లులపై ఆధారపడిన వారు ఉన్నారు.

మూసివేత దిశలో పరిశ్రమలు

జిల్లాలో ప్రధానంగా కేసముద్రం మార్కెట్ పరిధిలో 11 పసుపు డోలా మిల్లులు ఉన్నాయి. ఇందులో 9మూతపడగా, రెండు మిల్లులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. మార్కెట్‌లో పసుపు అందుబాటులో లేకపోవడంతో పాలిషింగ్ యూనిట్లు, పౌడర్ మిల్లులు బంద్ అవుతూ వస్తున్నాయి. దీంతో ఏళ్ల తరబడి పసుపు డోలాల్లో, ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు వీధిన పడ్డారు. వారంతా ఇతర కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే రీతిలో నూనె మిల్లులు 8 ఉండగా వీటిలో 7 మిల్లులు బంద్ అయ్యాయి. వేరుశనగకాయల నుంచి గింజలను వేరు చేసి పల్లిపప్పును ఎగుమతి చేసే మిల్లులు 20 ఉండగా అన్ని బంద్ కావడం గమనార్హం. ఆయా మిల్లులకు అనుబంధంగా ఉన్న మార్కెట్లకు వేరుశనగకాయ విక్రయానికి రాకపోవడంతో నూనె మిల్లులకు ప్రధాన ముడిసరుకు అందుబాటులో లేక బంద్ చేసుకున్నారు. జిల్లాలో అరకొర వేరుశనగ రాబడులతో ఒకటి, రెండు మిల్లులు మిగిలి ఉన్నాయి. మూతపడిన నూనెల మిల్లులపై ఆధారపడి జీవిస్తున్న మిల్లు డ్రైవర్లు, కార్మికులు ఉపాధి కోల్పోయారు.



కేసముద్రంలో పల్లిపప్పు రికార్డు గేటర్ వద్ద పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

పసుపు, వేరుశనగ సాగుపై సన్నగిల్లిన ఆసక్తి

తగ్గిన సాగు విస్తీర్ణం?

జిల్లాలో పసుపు, వేరుశనగకాయ సాగు విస్తీర్ణం తగ్గడానికి అధిక పెట్టుబడులు, తక్కువ ధరలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఆయా పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతుకు నష్టాలు మిగులుతున్నాయి. దశాబ్ధంన్నర క్రితం క్వింటాకు రూ.16వేల ధర నమోదైన పసుపు మళ్లీ అదే రీతిలో అమాంతం పెరగక పోతుందా.. అనే ఆశతో ఏటా రైతులు సాగు చేస్తూనే ఉన్నారు. అధిక పెట్టుబడితో పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పసుపు రైతులు పదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో చాలా మంది రైతులు ఏటా పసుపు సాగును తగ్గిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది పసుపు ధర భిన్నంగా ఉంది. సీజన్ ఆరంభంలోనే క్వింటాకు రూ.12వేల నుంచి రూ.14వేల వరకు ధర నమోదవుతోంది. అయితే రైతుల వద్ద పసుపు లేకుండా పోయింది. ఇతర రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు నాణ్యమైన పసుపు లభిస్తోంది. ఇక వేరుశనగ పంట సరిగ్గా ఇదే తరహాలో ధరలు లేకపోవడం, పెట్టుబడులు ఎక్కువ కావడం, కోతుల బెడద కారణంగా రైతులు క్రమంగా ఈ పంట సాగుకు దూరమవుతున్నారు. ఇదిలా ఉండగా ఈసారి పసుపు ధర అత్యధికంగా ఉండడంతో విత్తనం పసుపుకు డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో కొంతమంది రైతులు పసుపును విత్తనంగా క్వింటాకు రూ.5వేల చొప్పున నేరుగా ఇతర రైతులకు అమ్ముతున్నారు.

ధరలపై పొరుగు రాష్ట్రాల ప్రభావం

పసుపు, వేరుశనగ పంటల ధరలపై పొరుగు రాష్ట్రాల దిగుబడులు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. మహా రాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లో పసుపు, వేరుశనగ పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పైగా అక్కడి నేలలు పసుపు, వేరుశనగలో నాణ్యమైన రకం పండించేందుకు అనుకూలంగా ఉంటూ రెట్టింపు దిగుబడి వస్తోందని తెలుస్తోంది. నాణ్యత విషయంలో ఈ ప్రాంతంలోని పసుపు, వేరుశనగ పంటలు పొరుగు రాష్ట్రాల కంటే తక్కువగా

మిగతా 8వ పేజీలో

జిల్లాలో పసుపు విస్తీర్ణం ఎకరాలలో..

సంవత్సరం	విస్తీర్ణం
2016-17	20693
2017-18	11138
2018-19	11255
2019-20	10358
2020-21	8869
2021-22	4401
2022-23	2500

కేసముద్రం మార్కెట్‌లో గత పదేళ్లలో వేరుశనగ రాబడులు క్వింటాళ్లలో..

సంవత్సరం	కేసముద్రం
2013-14	55975
2014-15	17355
2015-16	14466
2016-17	27635
2017-18	12263
2018-19	18107
2019-20	6130
2020-21	6819
2021-22	1866
2022-23	3086
2023-24	1054



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

సీరోలు, ఏప్రిల్ 6 : సీరోలు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సై విజయ్‌రామ్‌కుమార్‌కు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌అమలులో ఉన్నందునవిధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

- ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

నెల్లికుదురు, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం రైతుదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి మాట నిలబెట్టుకోలేదన్నారు. రైతుబంధు సక్రమంగా వేయకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీలో రైతులకు కాళేశ్వరం నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కల్యాణలక్ష్మీ పథకాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు. మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జడ్పీటీసీలు మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పరిపాటి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ వెన్నాకుల వాణి శ్రీనివాస్, యాదగిరిరెడ్డి, పూకంటి యాకుబ్‌రెడ్డి, గుండ్ల వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండలంలోని మదనాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడుతున్న త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చినజీయర్‌స్వామి



లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను సన్మానిస్తున్న మదనాపురం గ్రామస్థులు

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

- సర్వప్రాణులు దైవస్వరూపమే..
- బుద్ధిని బట్టి మనిషి ఉన్నతమైన ప్రాణిగా రూపొందాడు..
- ఆధ్యాత్మిక కేంద్రాలే.. పరివర్తన క్షేత్రాలు..
- త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చినజీయర్‌స్వామి

వివరాలు 7లో..

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- స్వీప్ నోడల్ అధికారి మరియన్న



మహబూబాబాద్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ నోడల్ అధికారి మరియన్న

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి జి.మరియన్న అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచనల మేరకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి మరియన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై మేనేజర్ కృష్ణవేణి, డీఎస్‌వో రాజేందర్ పాల్గొన్నారు.

మునిసిపాలిటీ ఆధ్వర్యంలో..

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మునిసిపల్ డీఈ ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ పట్టణంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ ఉపేందర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా అర్బన్ పీడీ విజయ, సీఎల్‌ఆర్పీ ఉమ, ఆర్పీలు మంజుల, అరుణ, వసంత, స్రవంతి, మమత పాల్గొన్నారు.

జిల్లాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

పీహెచ్‌సీ, అంగన్‌వాడీ సెంటర్, సఖి కేంద్రం తనిఖీ



మహబూబాబాద్‌లోని సఖి సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కార్యాలయాల్లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం తనిఖీలు చేపట్టారు. కురవి మండలం బలపాలలో జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సుందరీకరణ గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఐదు సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతిని అడిగారు. వేసవి కాలంలో సబ్‌సెంటర్ల ద్వారా ఆశ కార్యకర్తల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే రూపొందించిన తాగునీటి యాక్షన్ ప్లాన్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న గుడ్లు, పాలు, నూనె, బాలామృతం, పప్పులు సమయానికి అందించాలన్నారు.

మహబూబాబాద్ పట్టణంలోని బాలసదనం, సఖి కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులు లేని పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువుకునేందుకు వారి సంరక్షణ చూసుకునే విధంగా కేంద్రాలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వారికి మెనూ ప్రకారం భోజనం అందించాలని, వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కురవి తహసీల్దార్ సునిల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, డి.లక్ష్మి, సుగుణ, మనీషా, కల్యాణి, శ్రావణి పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 : జిల్లాలో ఈ నెల 7న మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హత పరీక్ష ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 1,343 మంది హాజరు కానున్నారని, వీరికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 7, 8, 9, 10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు నిర్ణీత పరీక్ష సమయాని కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్, సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదని సూచించారు. ఇతర వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు(9849761012)ను సంప్రదించాలన్నారు.

ఎల్బీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 : ములుగురోడ్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్బీ)లో శనివారం ఎంబీఏ విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి

గూడూరు, ఏప్రిల్ 6 : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని.. అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో పూజలు, ప్రవచనములు, భక్తుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రజలు, ప్రసాదాలే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయని, అవి అందరికి మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు. దేవాలయాలు, వాటిలో విగ్రహాలు మనస్సుకు అద్దంలా నిలుస్తాయన్నారు. మన ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేదే మంత్రమన్నారు. మంత్రం అంటే తరించే వారికి రచించేదేనని చెప్పారు. మనుషులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు చూస్తే అన్ని వేర్వేరే. కానీ, కలిసి సాగితే సుఖ జీవనమన్నారు. మంచి జీవితం కావాలంటే సహజీవనం అవసరం, అదే సమతా భావమని పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో వికార పోకడలు, నేనే గొప్ప, నేనే నిలువాలన్న స్వార్థ చింతనలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ తీరు మారాలి. మన ఇల్లు, మన ఊరు, సమాజం, దేశం, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలన్నారు. ప్రకృతిలో మనిషే కాదు.. చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు ఎన్నో ఉన్నాయి.. అవి లేకుండా మనిషి ఉండలేడు, కానీ మనిషి లేకుండా అవి ఉండగలవన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మనిషి ఇంటికే పరిమితమైతే ప్రకృతి పరవశించిన విషయాల్ని కళ్లారా చూశామని తెలిపారు. అందుకే మనం పదిలంగా ఉండాలంటే వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అద్దం ఎట్లయితే ముఖాన్ని చూపిస్తుందో.. అలాగే విగ్రహం మనిషి మనస్సులోని దేవుడిని చూపిస్తుందన్నారు. అర్థమండపం ఎట్లా ఉండాలి, ముఖ మండపం ఎట్లా ఉండాలి, దేవాలయంలో గజ, జయ, ధ్వజ స్తంభాల వద్ద నమస్కారం చేసిన తర్వాత గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల వద్ద మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రతీ వస్తువులో దేవుడు దాగి ఉన్నాడని, రాతి, లోహం, విగ్రహం, వస్త్రం, మట్టితో చేసిన బొమ్మలో సైతం దేవుడిలా కొలుస్తారని పేర్కొన్నారు. కదిలే ప్రాణులు, మనుషులకు, కదల్లేని ప్రాణులు, చెట్లు వాటికి స్థావరాలుగా ఉంటాయన్నారు. గ్రామంలో సంపదకు లోటు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. శిలాలోహం భగవంతుడి స్వరూపాలేనని అన్నారు. దేవాలయంలో విగ్రహాలు, శిల, ఉత్సవ రూపంలో ఉంటాయని స్పష్టం చేశారు.


చిన్నజీయర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సుధీర్‌రెడ్డి సేవలు భేష్..

మదనాపురం గ్రామంలో దేవాలయం ఉండాలని ఆకాంక్షించి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోశాల, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించిన లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఉన్న ఊరును మరిచిపోకుండా ప్రజల సుఖసంతోషాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.1.50 కోట్ల సొంత ఖర్చులతో ఆధ్యాత్మిక ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయంలో అన్ని వసతులను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, లింగాల నితిన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎల్.నర్సింహారెడ్డి, మానుకోట ఎంపీ మాలోతు కవిత, హరిత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, మేరెడ్డి సురేందర్, యాదవరెడ్డి, రణధీర్‌రెడ్డి, బోడ కిషన్, మోతీలాల్, చెల్పూరి వెంకన్న, బండి వెంకన్న పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న చిన్న జీయర్‌స్వామి

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్

కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

ములుగు, ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజారి కాంకేర్ పరిధి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లాలో అలజడి సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం, అందులో భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన సంతోష్ అలియాస్ సాగర్ ఉండటం సంచలనం కలిగించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగి 13 మంది మావోయిస్టులు హతమైన నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జిల్లా పోలీసులు నిఘా పెంచారు. పౌరుల రాకపోకలపై కన్నేశారు. విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను అలర్ట్ చేశారు. తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు వాజేడు మండలంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటన ఎదురవ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించే విషయమై చర్చించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఈ సమావేశంలో మావోయిస్టులకు చెక్‌పెట్టే పలు అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు తెలిసింది. వ్యూహాత్మకంగా అడుగులు వేసే క్రమంలో కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు శుక్రవారం నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ బలగాలకు ములుగు జిల్లా పోలీసులు, సరిహద్దు స్టేషన్‌లలో సుదీర్ఘకాలం పనిచేసి ఈప్రాంతంపై అవగాహన ఉన్న అధికారులను రంగంలోకి దించినట్లు సమాచారం. అనుకున్నట్టుగానే పోలీసులు టార్గెట్‌ను రీచ్ అయ్యారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి నాయకుడితోపాటు మొత్తం ముగ్గురు సభ్యులను మావోయిస్టులు కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులు మృతదేహాలను తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరిస్తూ బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ప్రకటన జారీ చేయగా కొద్దిగంటల వ్యవధిలోనే మావోయిస్టులు ఈ ఘటనపై స్పందించారు. ఆజాద్ పేరిట ఓ లేఖ విడుదలైంది. పక్కా సమాచారంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని, ములుగు ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజార్ కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులతో పాటు గ్రేహౌండ్స్ బలగాలు జాయింట్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో సీపీఐ మావోయిస్టుపార్టీ సీఆర్‌సీ-2 (సెంట్రల్ రిక్రూట్మెంట్ కమిటీ) కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్, మరొకరు మణిరామ్ ఉండగా మిగిలిన మరొకరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. మణిరామ్, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామానికి చెందినట్లు సమాచారం. బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ధ్రువీకరించగా వూసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఘటన ప్రాంతంలో ఒక ఏకే-47, ఎల్ఎంజీ, విప్లవ సాహిత్యం లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రెండేళ్ల తర్వాత..

చివరిసారిగా 2022జనవరి 18న ఇదే కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి మడకం సింగి అలియాస్ శాంత, గుండాల-నర్సంపేట ఏరియా కమిటీ కమాండర్ కొమ్ముల నరేష్ అలియాస్ బుచ్చన్న, మరో మావోయిస్టు సభ్యుడు మృతిచెందాడు. పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆరోజు ఉదయం 7గంటల ప్రాంతంలో మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండుగంటల పాటు ఇరువర్గాల నడుమ కాల్పులు జరగగా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మధుకు బుల్లెట్ గాయమైంది. కాగా, ఈ ఎదురుకాల్పుల ఘటన నుంచి వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ తప్పించుకున్నాడు. కాగా, మృతిచెందిన వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత సుధాకర్ భార్య.

అట్టుడుకుతున్న సరిహద్దు గ్రామాలు

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌నుంచి తెలంగాణ సరిహద్దు మీదుగా నిత్యం నక్సల్స్ కదలికలు ఉంటాయి. పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించే క్రమంలో మావోయిస్టులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన ప్రతీసారి తెలంగాణ పోలీసులు తిప్పికొడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతరలు, మారణాయుధాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో మావోయిస్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడిచిన నాలుగేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలను పరిశీలిస్తే.. 2020 సెప్టెంబరు 3న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దేవర్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, 20వతేదీన చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, అదే నెల 23వతేదీన చర్ల మండలం జన్నారం అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అక్టోబరు 18న ములుగు జిల్లా మంగపేట మండలం కొప్పుగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఒకరు మణుగూరు ఏరియా కమాండర్ సుధీర్. ఇదేనెల 25న వాజేడు మండలం టేకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు, 2021 ఆగస్టు 1వతేదీన చర్ల మండలం బోదనెల్లి అటవీ ప్రాంతంలో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డిసెంబరు 28న పెసళ్లపాడులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందడం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు పల్లెలు అట్టుడుకుతున్నాయి. ఆదివాసీ గూడాలు, గొత్తికోయ గుంపులపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను జరుపుతున్నారు. దీంతో చిట్టచివరి పల్లెల జనం భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా హుషారుగా..

రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ

నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్

అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: భావి భారత ఇంజనీర్ల వసంతోత్సవ వేడుకల రెండోరోజు అదే జోష్ కొనసాగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మసూద సినిమా నిర్మాత రాహుల్ యాదవ్ నక్క, గామి సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగిత అండ్ టీమ్ టాక్ షో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కిక్కిరిసిన విద్యార్థులను అలరించింది. వరంగల్ నిట్‌లోని వివిధక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.


ఖల్‌నాయక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న దృశ్యం

ర్యాప్, నిట్ సోలో ఐడల్ అదరహో...

నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాప్, నిట్ సోలో ఐడల్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ర్యాప్ గీతాలు పాడుతూ శ్రోతలను ఆనందింపజేశారు.

వాట్స్ డిఫరెంట్.. మెదడుకు మేత..

యూత్ రెండ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో ఆట వాట్స్ డిఫరెంట్.. ఈ ఆటలో రెండు గదుల్లో నిర్వాహకులు వేర్వేరు ఛాయాచిత్రాలను ఉంచుతారు. రెండు గదుల్లోకి వెళ్లి వచ్చిన పార్టిసిపెంట్స్ వాటిని గుర్తుంచుకొని రాయాలి. లేదంటే ఈ ఆటలో ఓడిపోయినట్లే.

తెలుగు జిలుగుల చదరంగం..

తెలుగు లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో గోడకు కొన్ని బెలూన్లు అతికించి ఉంచారు. పాల్గొనదలచిన వారు బెలూన్‌లలో ఒక్కదానిని పగలగొడితే అందులో ఓ టాపిక్ ఉంటుంది. ఆ టాపిక్ మీద తెలుగులో మాట్లాడాల్సి ఉంటుంది.

హంగర్ గేమ్స్.. ఫిట్‌నెస్‌పై గురి..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తుంది. ఫిట్‌నెస్, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ గేమ్‌ను నిర్వహించారు. పాల్గొనే విద్యార్థులు సిట్‌అపుట్స్, పుషప్స్ తదితర వ్యాయామ సంబంధ వర్కవుట్స్ చేయాల్సి ఉంటుంది.

మాస్టర్ చెఫ్... అదిరె వంటలు..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో వంటల గేమ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌లో ఒక బాక్స్‌లో వేసిన చిట్టీల నుంచి పాల్గొనే వారు అందులో నుంచి కొన్ని చిట్టీలను తీసుకొని అందులో రాసిన పదార్థాలతో రాతపూర్వక వంటను తయారు చేయాల్సి ఉంటుంది.

తక్‌దీర్‌కా ఆగే..

ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో ఫొటో వెనకాల రాసి ఉన్న విషయాన్ని పాల్గొనే వారు చేయాల్సి ఉంటుంది. ఇందులో పాటలు, సంభాషణలు, నృత్యాలు తదితర అంశాలు ఉంటాయి.

ఖల్‌నాయక్.. ఏ సినిమాలో విలన్..

ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. పాల్గొన్న విద్యార్థులు ఫొటోల ఆధారంగా సంబంధిత ఫొటోలు ఉన్న వివిధ భాషల్లోని విలన్‌లు నటించిన చిత్రాల పేర్లు చెప్పాల్సి ఉంటుంది.

ఇంకా అనేకం..

నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇంకా వివిధ రకాలనైన ఫన్ గేమ్స్‌ను నిర్వహించారు. హిప్‌సోల్ క్విజ్, ఫాస్టెస్ట్ వన్ టూ గెస్, ఫిల్మ్ క్విజ్, యానిమీ మ్యూజియం, ఫొటో క్విజ్, మేళా, ఫిల్మ్ ట్రెజర్ హంట్, డంబ్ చారేడ్స్ తదితర ఆటలు కొనసాగాయి.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు

తెలుగు సినిమా నటుడు, నిర్మాత నవదీప్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్టర్స్ కట్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తారు.

సినిమాల్లోకి వచ్చేయండి..

టాక్ షోలో మసూద సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్క

సినిమా రంగంలోకి రావాలనిపించే యువ ఇంజనీర్లు దూకేయండి.. ఉత్సాహవంతులైన యువతను ప్రతీ రంగం ఆహ్వానిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నతమైన విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తాను మొదటి గేమ్స్ రంగంలోకి వెళ్లాలనుకున్నానని, తర్వాత రాజకీయం వైపు వెళ్లాలని, ఆ తర్వాత సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాను. అదీ చేతకాక చివరికి సినిమా రంగాన్ని ఎంచుకున్నాను. ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడే నాకంటూ ప్రత్యేకత ఉండాలనే భావన నాలో ఉండేది. అదే భావనతో సినిమా రంగంలోకి వచ్చాను. ప్రతీ వ్యక్తి ప్రయత్నాలు చేయాలని, ఆ ప్రయత్నాల్లో పొరపాట్లు సహజరంగా జరుగుతాయన్నారు. పొరపాట్లు చేయకుండా విజయాలు అందుకోలేమన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సినిమా రంగాన్ని ఎంచుకున్నాక మా నాన్న తనతో చాలా రోజులు మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. ప్రతీ రంగంలోనూ తప్పొప్పులుంటాయని, అయితే సినిమా రంగంలో ఇవి బయటపడుతాయన్నారు. నా పని నేను చేసుకుపోవాలనే స్వధర్మ ప్రొడక్షన్స్ స్థాపించాను. మంచి ప్రొడక్షన్ టీమ్ ఉంటే మంచి సినిమాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం ఫుల్ లెన్త్ క్యారెక్టర్‌తో 'బ్రహ్మానందం' టైటిల్‌తో ఇంజనీరింగ్ బేస్డ్ లవ్ స్టోరీ పూర్తి కామెడీగా తీయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో సినిమాలు వస్తాయన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

సృజన అద్భుత దృశ్యమానం గామి చిత్రం

చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగితాల

హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలకు అద్భుత దృశ్యరూపమే గామి చిత్రం అని ఆ సినిమా దర్శకుడు విద్యాధర్ కాగితాల అన్నారు. చిత్ర బృందంలోని సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ చిత్రం ఊహించినదానికన్నా బాగా రావడమే కాకుండా అనూహ్య విజయాన్ని సాధించిందని ఆయన అన్నారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా శనివారం రెండో రోజు వరంగల్ నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ హాల్‌లో నిర్వహించిన డైరెక్టర్‌కట్స్ ఈవెంట్‌లో దర్శకుడు విద్యాధర్‌తో పాటు గామి చిత్ర బృందం పాల్గొన్నది.

ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే పుస్తకం అవుతుంది. సృజనకు దృశ్య రూపం ఇస్తే అది సినిమా అవుతుందన్నారు. గామి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక నూతన వరవడిని సృష్టించిందని అన్నారు. మొదట తాను లఘు చిత్రాల దర్శకుడినని 2014 నుంచి 2017 మధ్య కాలంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీశానని చెప్పారు. మెకానికల్ ఇంజనీర్ అయిన తాను యాంత్రికంగా ఉండలేక సృజనాత్మకతకు వేదిక అయిన ఫిల్మ్‌మేకింగ్ వైపు అడుగులు వేశానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో అనేక మంది ఫిల్మ్‌మేకర్లు ఉన్నారన్నారు. అవునా కాదా? మీలో ఎంత మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అడగ్గా పలువురు విద్యార్థులు చేతులెత్తారు. గామి చిత్రం తీయడంలో తమ చిత్ర బృందం ఎదుర్కొన్న సాదక బాధకాలను విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. నిట్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ సభ్యుడు సాయి శ్రీ చరణ్ విద్యార్థుల పక్షాన చిత్ర నిర్మాణానికి సంబంధించి అడిగిన పలుప్రశ్నలకు విద్యాధర్‌తోపాటు చిత్ర బృందంలోని మిగతా సభ్యులు సమాధానాలు ఇచ్చారు. ఈ డైరెక్టర్ కట్స్ పలు రౌండ్లుగా సాగింది. ఫన్ టైమ్ ఎమోజీ రియాక్షన్స్, చిత్రంపై మీమ్స్, ఇష్టమైన సన్నివేశం మొదలైన వాటి గురించి అడిగిన ప్రశ్నలకు దర్శకుడితో పాటు చిత్రబృందం ఇచ్చిన సమాధానలకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. నిట్‌లోని ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో హాల్ కిక్కిరిసిపోయింది. అనంతరం విద్యాధర్ అంతకు ముందు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను, అలాగే గామీ ట్రైలర్‌ను ప్రదర్శించారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి సురేష్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సురేష్

కురవి, ఏప్రిల్ 6 : ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మానుకోట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కురవి పీహెచ్‌సీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సురేష్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో వడదెబ్బ తగిలి ప్రజలు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అనవసరంగా బయటకు రావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం, పోక్సో చట్టం, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, కురవి ఎస్సై గోపి, కోర్టు కానిస్టేబుల్ లింగయ్య, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

గంగారం, ఏప్రిల్ 6 : వేసవిలో గిరిజనులు వడగాలుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. శనివారం గంగారం, కోమట్లగూడెం పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఎండలు మండుతున్నందున ప్రతీ పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. గిరిజనులు పనులు చేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి వార్డులో రోగుల పడకలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సిబ్బంది హాజరు పట్టీని తనిఖీ చేశారు. అనంతరం కోమట్లగూడెం 24గంటల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఏఎన్ఎంల వ్యాక్సిన్ సక్రమంగా వేస్తున్నారా.. లేదా అడిగి తెలుసుకున్నారు. ఆయా పీహెచ్‌సీలలో ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ, గంగారం వైద్యాధికారి ప్రత్యూష, కోమట్లగూడెం వైద్యులు మురళీధర్, డీపీహెచ్ఎన్ మంగమ్మ, హెచ్‌వీ సరోజని తదితరులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

కేసముద్రం, ఏప్రిల్ 6: కేసముద్రం మండలం ధన్నసరిలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో శనివారం షీటీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, డయల్ 100, సైబర్ నేరాలు, మహిళా భద్రత అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో షీటీం ఎస్‌ఐ సునంద, ఏఎస్‌ఐ ఆనందం, కరస్పాండెంట్ కిరణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్, ఊర్మిళ పాల్గొన్నారు.

జూన్ 1 నాటికి యూనిఫామ్స్ అందించాలి : డీఈవో


మహబూబాబాద్ స్పెషల్ యూపీఎస్‌లో యూనిఫాం కొలతలను పరిశీలిస్తున్న డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫామ్స్‌ను జూన్ 1వ తేదీ నాటికి పాఠశాలలకు చేరవేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ యూపీఎస్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకందించే యూనిఫామ్ క్లాత్‌ను స్టిచ్చింగ్ కోసం సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా డీఈవో రామారావు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 872 ఉండగా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందించేందుకు క్లాత్ వచ్చిందని చెప్పారు. వాటిని మహిళా సంఘాల ద్వారా కుట్టించేందుకు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల మేజర్మెంట్ తీయించి జూన్ 1 నాటికి కుట్టిన యూనిఫామ్స్ పాఠశాలలకు అందేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంవో ఆజాద్‌చంద్రశేఖర్, డీఎస్వో అప్పారావు, హెచ్ఎం సోమయ్య పాల్గొన్నారు.

మద్రాస్ ఉగాది వేడుకల్లో కవి సత్యనారాయణకు సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6 : మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన ఉగాది వేడుకలో మహబూబాబాద్ పట్టణానికి చెందిన కవి గుర్రపు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన 60 మంది తెలుగు కవులు వినిపించిన విభిన్న కవితలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందులో సత్యనారాయణ వికృత వసంతం కవితను వినిపించారు. ఈ వేడుకలో ప్రముఖ సినీగేయ రచయిత భువన చంద్ర సత్యనారాయణను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో సత్యనారాయణ పాల్గొని సన్మానం పొందడం పట్ల పట్టణానికి చెందిన కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6: మహబూబాబాద్ పట్టణం పాత బజారులో ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బజారులోని నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్ నగర్, ఎల్‌బీజీ నగర్, రాహుల్‌నగర్, కంకరమిల్లు, చిట్యాల గోపయ్యనగర్, ఏటిగడ్డతండా, రాంచంద్రాపురం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, బతుకమ్మ విగ్రహాల రోడ్, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

- కొత్తబజారులోని పులిగోపాల్‌నగర్, మార్వాడీ బజారు, జిల్లా ఆస్పత్రి, కురవి రోడ్, అయ్యప్పనగర్, కవిత కాలనీల్లో ఆదివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏఈ నవ్యశ్రీ తెలిపారు.

బీఆర్ రణదేవ్ స్ఫూర్తితో కార్మికోద్యమాలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు


రణదేవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నేతలు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6: ప్రముఖ కార్మికోద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపకులు బీటీ రణదేవ్ స్ఫూర్తితో కార్మికోద్యమాలను బలోపేతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని జీకే కోల్ స్టోరేజ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బీటీ రణదేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ముంబయిలో 1904లో జన్మించిన రణదేవ్ టెక్స్‌టైల్స్ మిల్లు కార్మికుల దుర్భర జీవితాలను చూసి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు చేశారని చెప్పారు. తన జీవిత కాలమంతా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్యాగం చేశారని, ఆయన ఎంపీగా గెలిచి కార్మికుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తారని తెలిపారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, బత్తుల వెంకన్న, శ్రీను, వీరస్వామి, ప్రసాద్, బాలు, కొమురయ్య పాల్గొన్నారు.

పశుపక్షాదుల దప్పిక తీర్చేందుకు నీటి తొట్టిలు


పట్టణంలో తొట్టిల వద్ద నీరు తాగుతున్న పశువు, కోతులు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6: మహబూబాబాద్ పట్టణంలో పశుపక్షాదుల కోసం ప్రధాన రహదారుల వెంట మునిసిపల్ అధికారులు నీటి తొట్టిలను ఏర్పాటు చేశారు. వేసవి కాలం ఆరంభం ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు పెరిగి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తాగునీటి కోసం పశుపక్షాదులు ఇబ్బందులు పడుతుండగా నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో రోడ్ల వెంట నీటి తొట్టిలను పెట్టడంతో పశువులు, కోతులు దప్పికను తీర్చుకుంటున్నాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లా కేంద్రంలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు

జాగ్రత్తలపై కరపత్రాలతో వైద్యశాఖ విస్తృత ప్రచారం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6 : జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. తాజాగా శనివారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.7 డిగ్రీలు నమోదు కాగా, గరిష్ఠంగా 43.2 డిగ్రీలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వేళలో మాడు పగిలేలా ఎండలు కొడుతుండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏప్రిల్ మాసం ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో గత వారం రోజులుగా 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఈ క్రమంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కరపత్రాలను ముద్రించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. జిల్లా కేంద్రంలో హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతకు అపస్మారక స్థితిలోకి వెళితే హెల్ప్‌లైన్ సెంటర్ 96766 21992కు ఫోన్ చేసి వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన వైద్యసేవలపై వైద్యశాఖ తగు జాగ్రత్తలను సూచిస్తుంది.


జిల్లాలోని తొర్రూరులో నిర్మానుష్యంగా ఉన్న అంబేద్కర్ సెంటర్ రోడ్డు

వడదెబ్బ లక్షణాలు..

- ఎండలో ఎక్కువ సేపు ప్రయాణం చేసిన, పని చేసిన మనిషి మెదడులో ఉష్ణోగ్రతలను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల వడదెబ్బ తగులుతుంది.
- తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం
- శరీరంలోని లవణాలను కోల్పోవడం
- నాడి వేగంగా కొట్టుకోవడం, మూత్ర విసర్జనలో మంట
- మగతగా లేదా అపస్మారక స్థితికి చేరడం

ప్రథమ చికిత్స..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ, గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి చల్లని నీటిలో తడిపిన గుడ్డతో తుడవాలి.
- మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి.
- ప్రథమ చికిత్స చేసిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీరు ఎక్కువగా ఉండే కొబ్బరి బొండం, పుచ్చకాయ, నిమ్మరసం, మజ్జిగ, అన్ని రకాల పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.
- తప్పనిసరి పరిస్థితిలో ఎండలో వెళితే గొడుగు, టోపి లేదా తలపాగ వాడాలి.
- ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయట తిరగడం, ఆడడం చేయరాదు.
- ఇంట్లోని తలుపులు, కిటికీలకు జనపనార లేదా కొబ్బరి నారతో తయారు చేసిన తట్టు కట్టి నీళ్లు చల్లుకోవాలి.
- కుండలోని నీరు తాగడం మంచిది. మత్తు పానీయాలు తీసుకోవద్దు.
- ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో ఎక్కువగా పని చేయకూడదు.
- ప్రయాణ సమయంలో మజ్జిగ లేదా నిమ్మరసం వెంట తీసుకుపోవాలి.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

మహబూబాబాద్‌రూరల్, ఏప్రిల్ 6: మహబూబాబాద్‌లోని స్నేహ నగర్‌లో భూతగాద దాడి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. గత నెలలో స్నేహనగర్ కాలనీలో భూతగాదలో కుండె బీరయ్యపై దాడిచేసిన ఘటనలో బత్తుల కృష్ణ, వీరంటి ముఖేష్‌లను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు ఇసుక వేలం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల లారీలో పట్టుబడిన ఇసుకకు వేలం వేస్తున్నట్లు మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి శనివారం తెలిపారు. పట్టణానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి ఇసుక లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటలకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇసుకకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

మానుకోట పార్లమెంట్ కన్వీనర్‌గా పీరయ్య

నెహ్రూ సెంటర్, ఏప్రిల్ 6 : ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా గుగ్గిళ్ల పీరయ్యను ఏకగ్రీవంగా నియమించారు. ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పార్లమెంట్ కన్వీనర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులకు పీరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ వైఖరితో విద్యార్థులకు అన్యాయం

కురవి, ఏప్రిల్ 6 : జీవో 46, 317పై ప్రభుత్వం అనుకూల ప్రకటన చేయకపోవడం మెరిట్ విద్యార్థులకు అన్యాయం చేసినట్టేనని నిరుద్యోగ కానిస్టేబుల్ అభ్యర్థుల నాయకుడు గుగులోతు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కురవిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం తీరు బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక గిరిజన జనాభా కలిగిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీవో 46 వల్ల తమకు న్యాయం చేయని పక్షంలో నిరుద్యోగుల తరుపున పార్లమెంట్ ఎలక్షన్ బరిలో పోటీ చేస్తానని హెచ్చరించారు.

ఓటరు అవగాహన ర్యాలీ

కేసముద్రం, ఏప్రిల్ 6 : కేసముద్రంలో శనివారం క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం(స్వీప్) కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ తాళ్లూరి దామోదర్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పూలే సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. మే 13న జరిగే ఎన్నికల్లో వంద శాతం ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సౌజన్య, డీపీఎం రాజు, ఏపీఎం రాజీర్, సీసీలు వెంకటనారాయణ, వెంకటరమణ, శ్రీను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై పార్టీలు స్పష్టత ఇవ్వాలి

మరిపెడ, ఏప్రిల్ 6 : సీపీఎస్ రద్దుపై రాజకీయ పార్టీలు స్పష్టత ఇస్తేనే ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాల ఆదరణ పొందుతారని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి లింగాల మహేశ్ ఆయా పార్టీలను కోరారు. శనివారం ఆయన మరిపెడ విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 84లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారని, రాష్ట్రంలో 2.30లక్షల మంది ఉన్నరన్నారు. 2004 తర్వాత నియామకమైన వారికి పెన్షన్ స్కీం రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. సీపీఎస్ విధానంపై ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనట్లైయితే ఆయా పార్టీలకు తగిన గుణపాఠం తప్పదన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

మరిపెడ, ఏప్రిల్ 6 : గ్రామ స్పెషల్ ఆఫీసర్లు తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సైదులు అన్నారు. శనివారం మరిపెడ మండల్ పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు అధ్యక్షతన జరుగగా తహసీల్దార్ మాట్లాడారు. వివిధ శాఖల అధికారులతో ఎంపీపీ అరుణ సమీక్షించారు. మిషన్ భగీరథ నీటిని నిరంతరం సరఫరా చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పాలేరు జలాశయానికి కృష్ణ జలాలను విడుదల చేసిందని డీఈఈ అనూష సభకు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో రేవతి, వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాళ్లపెల్లి రఘు, ఎంపీటీసీలు, పీహెచ్‌సీ డాక్టర్ రవి, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు

తొర్రూరు, ఏప్రిల్ 6 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగిపై కార్యాలయ సీఈవో వేధింపులకు పాల్పడటంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తొర్రూరు ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం... సొసైటీ కార్యాలయంలో సీఈవోగా పనిచేస్తున్న వెలుగు మురళి అదే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఒక మహిళపై వేధింపులకు పాల్పడుతుండడంతో విసిగిపోయిన ఆ మహిళ అతనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కేసు వివరాలను డీఎస్పీకి అందించామని, విచారణ అనంతరం నిందితుడిపై చర్యలు ఉంటాయని ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలేది

డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి వంద రోజులైనా ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ విమర్శించారు. శనివారం ఆ పార్టీ చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 100 రోజుల లోపే రైతు రుణమాఫీ, రూ.15వేలు రైతు బంధు ఇస్తానని చెప్పి రైతులను మోసం చేశాడన్నారు. పంట ఉత్పత్తులకు రూ.500 బోనస్ ఇస్తానని ఇవ్వట్లేదన్నారు. రైతులకు సాగు అందక ఇప్పటికే 200మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డట్లు చెప్పారు. 48 గంటల్లో రైతుల ఆత్మహత్యల వివరాలిస్తే వారికి పరిహారం చెల్లిస్తానని చెప్పిన సీఎం ఆ మాట నెరవేర్చలేదన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, ఎంపీపీ అరుణరాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తాళ్లపెల్లి శ్రీనివాస్, రఘు, తోట లాలయ్య, బుచ్చిరెడ్డి, పిచ్చిరెడ్డి, బాదావత్ రాజు, గుగులోత్ రవి, జానీమియా, కిశోర్, రాంచంద్రయ్య, మంగపతిరావు, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

తుక్కుగూడ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


మహబూబాబాద్‌లో వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఘనపురపు అంజయ్య, తొర్రూరు నుంచి సభకు బయలుదేరిన నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తుక్కుగూడ జనజాతర సభకు ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు జిల్లా నుంచి శనివారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలన్న సంకల్పంతో తుక్కుగూడలో నిర్వహించిన బహిరంగ సభకు కాంగ్రెస్‌శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిపోయారు. ఆయా నియోజకవర్గాల పరిధిల్లో ఎమ్మెల్యేల నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రైవేట్, సొంత వాహనాల్లో సభకు తరలిపోయారు. మహబూబాబాద్ నుంచి అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కౌన్సిలర్లు పోతురాజు రాజు, తాళ్లపల్లి జగన్, భూక్య శ్రీను, నాయకులు బానోత్ ప్రసాద్, గుగులోతు వెంకట్, పింగ్రాల రాందాసు, సిరిపురం వీరన్న, బండారు చిరంజీవి, అజయ్ తదితరులు తరలారు. అలాగే చిన్నగూడూరు నుంచి మండల అధ్యక్షుడు వేంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నాగేష్‌గౌడ్, బిక్కు నాయక్, శ్రీనివాస్, కిరణ్, వెంకన్నలు తరలివెళ్లారు. పెద్దవంగర నుంచి రంగు మురళీగౌడ్, దాసరి శ్రీనివాస్, హరికృష్ణ, వెంకన్న, రవీందర్ రెడ్డి, మహేష్, సతీష్, పాండు, వెంకన్న, మల్లేష్, రవి వెళ్లారు. దంతాలపల్లి నుంచి మండల అధ్యక్షుడు భట్టు, గురుపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, భద్రు వెళ్లారు.

తొర్రూరు డివిజన్ కేంద్రం నుంచి సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. నిరంజన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు. కేసముద్రం నుంచి టీపీసీసీ సభ్యులు గుగులోతు దస్రునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గంటా సంజీవరెడ్డి, బండారు దయాకర్, బండారు వెంకన్న, కదిరె సురేందర్, రావుల మురళి, ఎండీ. తాజొద్దీన్, నూకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బయ్యారం నుంచి మండల కాంగ్రెస్ వర్గీయులు వేర్వేరుగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు ముసలయ్య, కిషన్‌నాయక్, వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాము నాయక్, రవి నాయక్, ప్రవీన్‌నాయక్, సుధాకర్‌నాయక్, రామనాథం, పంతునాయక్, నాగేశ్వర్‌రావు, గోవర్దన్, రవీందర్, సురేష్‌లు తరలివెళ్లారు. డోర్నకల్ నుంచి మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కాల సుమీర్‌చంద్ జైన్, తాళ్లూరి హనుమ, మాద శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్, సాధనాల వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన భాస్కర్‌లు తరలివెళ్లారు. కురవి నుంచి మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం నేతృత్వంలో ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాదావత్ రామునాయక్, అవిరె మోహన్‌రావు, గొల్లపల్లి రజినీకాంత్, తవనం సుఖేందర్‌రెడ్డి, సక్రు నాయక్ పాల్గొన్నారు.

రాబడి రాక.. సాగు చేయలేక..

(5వ పేజీ తరువాయి)

ఉండడంతో ధరలు ఉండడం లేదని తెలుస్తోంది. దేశీయ మార్కెట్లోకి వేలాది క్వింటాళ్లు ఇతర రాష్ట్రాల మార్కెట్ల నుంచే విక్రయానికి వస్తుండడంతో ఇక్కడి మార్కెట్లలో ధరలు ఉండడం లేదని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా సేలం వెరైటీ పసుపు సాగుచేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

పట్టించుకోని గత ప్రభుత్వం

పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయినా గత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు, కార్మికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పసుపు, వేరుశనగ పంటలు జిల్లాలో ఉనికి కోల్పోయే దశలో ఉండడంతో వాటి అనుబంధ రంగాలపై ప్రభావం చూపుతోంది. ఈ పరిణామాలు వేలాది మంది జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు రికార్డులు నెలకొల్పిన ఉత్పత్తులు, ధరలు ఇప్పుడెందుకు రావడం లేదనే పరిస్థితులను ప్రభుత్వం అధ్యయనం చేసి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. మార్కెట్లకు వస్తున్న పంట ఉత్పత్తులకు అనుగుణంగా వాటికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేసే ప్రణాళికలు రూపొందించాలని కార్మికులు కోరుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి వాటి అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

బీఆర్ఎస్, బీజేపీని ఓడించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 6 : పార్లమెంట్ ఎన్నికల్లో పేదలకు మేలు చేయని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని వీర భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణను విధ్వంసం చేసిన బీఆర్ఎస్‌ను, కార్పొరేట్లకు ఊడిగం చేసిన బీజేపీలను చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటికి ఇంకా అధికారంలో ఉన్నట్లు నేతలు భ్రమలో ఉన్నారని విమర్శించారు. దేశంలో 400 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు కంటున్న కలలు నిజం కావన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన ఇండియా కూటమిదే విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, నెల్లూరు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన ప్రసాద్, సైదమ్మ

బయ్యారం, ఏప్రిల్ 6 : లారీ, బైక్ ఢీకొనగా ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం బయ్యారం మండలంలో చోటుచేసుకుంది. పరిస్థితి విషమంగా మారడటంతో వైద్యులు క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాకాల కొత్తగూడ కార్లాయి గ్రామానికి చెందిన కేదాసు ప్రసాద్ వివాహ కార్యక్రమం నిమిత్తం బయ్యారం మండలం కట్టుగూడెం గ్రామంలోని మేనమామ స్వామి ఇంటికి వచ్చాడు. పెళ్లి కార్యక్రమం అనంతరం శనివారం ప్రసాద్ ద్విచక్ర వాహనంపై కట్టుగూడెం నుంచి కార్లాయి బయలుదేరాడు. ఈ క్రమంలోనే మార్గమధ్యలోని చర్లపల్లి శివారు టంకెమెత్తల ప్రాంతానికి రాగానే ఎదురెదురుగా వస్తున్న లారీ, బైక్ అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ప్రసాద్, సైదమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

మూడోసారి ప్రధానిగా మోదీని గెలిపించాలి

జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి మోదీని మూడోసారి ప్రధాని చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ బూత్‌లో 50 శాతం ఓట్లు బీజేపీకి పడేలా ప్రతీ కమిటీ పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించి వారిలో చైతన్యం కల్పించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మొసంగి మురళి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, దార ఇందుభారతి, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, రామడుగు వెంకటాచారి, పైండ్ల శ్రీనివాస్, వేముల కొమ్మాల్‌రెడ్డి, రేష్మ, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో...

మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో మండల అధ్యక్షుడు మారగాని రాజుగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి నీలం రంజిత్, గుగులోతు వీరన్న, గుర్రం నవీన్, జెరిపోతుల నరేష్, శీలం వెంకన్న, గండి సురేష్ పాల్గొన్నారు.

- తొర్రూరులో జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్, పూసాల శ్రీమాన్‌లు వేర్వేరుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పల్లె కుమార్, రవిబాబు, పులేందర్, నగేష్, నవీన్ పాల్గొన్నారు.
- డోర్నకల్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను పట్టణ అధ్యక్షుడు దేవాసింగ్ నాయక్ ఆవిష్కరించారు. మండలంలోని పెరుమాండ్ల సంకీస, వెన్నారంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గణేష్‌నాయక్ ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బాసాని నాగేష్, వెంకన్న, రాంబాబు, రెహమాన్, జయరాజ్, సుదర్శన్, ఉపేందర్, రమేష్, సురేష్, పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు

- కేసముద్రం విలేజ్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఇందులో ఓలం శ్రీనివాస్, వల్లభు వెంకటేశ్వర్లు, రడం వెంకన్న, తుంపిళ్ల శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్ పాల్గొన్నారు.
- కురవిలో మండల అధ్యక్షుడు రామోజు నాగరాజు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంతం పెంటయ్య, బుక్క శంకర్‌రావు, రేషబోయిన కృష్ణ, మల్లికార్జున్, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.